
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 28 అక్టోబరు 2025





శ్రీకాకుళంలో ఉమారుద్ర కోటేశ్వరుడికి అభిషేకం

శంభో శంకర



- సందడిగా కార్తీకమాస తొలి సోమవారం
- వర్షంలోనూ శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- ఆలయాల్లో పూజలు, దీపారాధనలు



టెక్కలి రూరల్: ఎండలమల్లన్నకు పూజలు చేస్తున్న భక్తులు



జలుమూరు : శ్రీముఖలింగంలో భక్తుల రద్దీ

అరసవల్లి/ టెక్కలి రూరల్/ జలుమూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఓ వైపు మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లావ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచీ వర్షాలు కురుస్తూనే ఉన్నా.. ఆలయాలకు వెళ్లి శివుడ్ని దర్శించుకుని పూజలు చేశారు. దీపాలు వెలిగించారు. శ్రీకాకుళంలోని ఉమారుద్రకోటేశ్వర ఆలయంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంతోపాటు టెక్కలి మండలం రావివలసలోని ఎండల మల్లన్న ఆలయంలో శివనామస్మరణ మార్మోగింది. ఇలా జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ సోమవారం వేకువజాము నుంచే భక్తులతో కిక్కిరిసిపోయాయి. శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వరాలయంలో అర్ధరాత్రి నుంచే పూజలు ప్రారంభమయ్యాయి. నాగావళి నదిలో కొంతమంది భక్తులు స్నానాలు ఆచరించారు. నది ఒడ్డున కార్తీక దీపాలు వెలిగిం చారు. ఘాట్ వద్ద అధికారులు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. అలాగే నక్కవీధి లోని శ్రీఉమాజఠలేశ్వరస్వామి, కలెక్టర్ బంగ్లారోడ్డులోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది.

● శ్రీముఖలింగంలో మధుకేశ్వరస్వామితోపాటు భీమేశ్వర, సోమేశ్వరాలయాలను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. తుఫాన్ కారణంగా భక్తులు ఇబ్బందులు పడ్డారు. వారికి అసౌకర్యం కలుగకుండా ఈవో ఏడుకొండలు చర్యలు చేపట్టారు. అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి పూజారి సుజాత అధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు నేతృత్వంలో జలుమూరు ఎస్‌ఐ బి.అశోక్‌బాబు గట్టి బందోబస్తు చేపట్టారు.

● రావివలసలో ఎండలమల్లన్న ఆలయానికి టెక్కలి నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపింది. దేవదాయశాఖ అధికారులు ఆలయ ప్రాంగణంలో భక్తులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఎచ్చెర్ల వ్యవసాయ మార్కెట్‌కు కొత్త కమిటీ

శ్రీకాకుళం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎచ్చెర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీని పునవ్యవస్థీకరించింది. ఈ మేరకు సహకారశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తి, పశుసంవర్ధకశాఖ మార్కెట్ చట్టం 1966(ధరా 5, 6(11) ప్రకారం ఏడాదిపాటు ఈ కమిటీ కొనసాగనుంది. కొత్త కమిటీలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గౌరవ అధ్యక్షుడిగా, అధ్యక్షురాలిగా నిడిగింట్ల పద్మ, ఉపాధ్యక్షురాలిగా బూరాడ వెంకటరమణ నియమితులయ్యారు. సభ్యులుగా అనకాపల్లి రాజేశ్వరి, కోరాడ వీర వెంకట నర్సింహమూర్తి, చిల్లా రామసూరి, మాడుగుల శ్రీనివాసరావు, పోతల చిరంజీవి, అడ్డాకుల వాసు, సరిపిల్లి సునీత, దండాసి రాంబాబు, గొర్లె దివ్య, అలుపన మీనాక్షి, కెల్ల భారతి, టొంప నీలవేణి, అనంత మహంతి వ్యవహరిస్తారు. అలాగే పైడిభీమవరం పీఏసీఎస్ అధ్యక్షుడు, రణస్థలం వ్యవసాయ సహాయ సంచాలకుడు, బెజ్జిపురం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారులను సభ్యులుగా నియమించింది.



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ శ్రీనివాసరావు, పోలీసుల అదుపులో నిందితులు

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

● 186 గ్రాముల బంగారం, 263 గ్రాముల వెండి స్వాధీనం

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్, గార పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు ఇళ్లల్లో జరిగిన దొంగతనం కేసుల్లో 186 గ్రాముల బంగారం, 263 గ్రాముల వెండి ఆభరణాలను శ్రీకాకు ళం రూరల్ పోలీసులు రికవరీ చేశారు. అం తర్ జిల్లాకు చెందిన ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ మేరకు ఏఎస్పీ(క్రైం) పి.శ్రీనివాసరావు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నిందితులను ప్రవేశపెట్టి వివరాలను వెల్లడించారు. 'శ్రీకాకుళం మండలం నందగిరిపేటలో రెండు, రాగోలులో ఒకటి, గార మండలం కె.మత్స్యలేశంలోని మూడు దొంగతనాల కేసులు ఇటీవల నమోదయ్యాయి. కాకినాడకు చెందిన రేకడి వెంకటేశ్వర్లు, ధర్మాది ప్రసాద్, మాడెం మోహన్ కుమార్ ఈ చోరీలకు పాల్పడినట్టు దర్యాప్తులో తేలింది. వారిని శ్రీకాకుళం మండలం తండ్యేంవలసలో ఆదివారం అరెస్టు చేశాం. వారి నుంచి చోరీకి గురైన 186 గ్రాముల బంగారం, 263 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నాం. ఆ ముగ్గురూ కాకినాడ సబ్‌జైల్లో ఉన్నప్పుడు స్నేహితులయ్యారు. దొంగతనాలను వృత్తిగా మార్చుకున్నారు. ఇంటికి, బీరువాలకు వేసిన తాళాలు చాకచక్యంగా తీయడంలో సిద్ధహస్తులు. ఒక్కొక్కరిపై సుమారు 25 కేసులు ఉన్నాయ'ని ఏఎస్పీ తెలిపారు.

అలాగే దూసి గ్రామంలో రూ.3లక్షల నగదు, 8 తులాల బంగారం పోయిందని తప్పుడు ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తి ఇంట్లో ఎటువంటి చోరీ జరగలేదన్నారు. తప్పుడు ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తిపై కూడా కేసు నమోదు చేశామని తెలిపారు. సమావేశంలో శ్రీకాకుళం వన్‌టౌన్ సీఐ పైడిపునాయుడు, రూరల్ ఎస్ఐ రాము పాల్గొన్నారు.

నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు 7లో

రైతు సేవా కేంద్రంలో వైద్య సేవలు
● రోగులకు తప్పని అవస్థలు ● ఇదీ బమ్మిడికాలనీ ఆరోగ్య ఉపకేంద్రం పరిస్థితి 8లో

అర్ధాంతరంగా నిలిచిన నిర్మాణాలు
● పలాస మండలంలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు



కడలి కల్లోలం

మొంథా తుఫాన్ ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. కళింగపట్నం, బందరువానిపేట, బారువ, కళ్లేపల్లి తీరాల వద్ద కొన్ని మీటర్ల ఎత్తున కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. మత్స్యకారుల శాలలు వద్దకు సముద్రపు నీరు వచ్చేసింది. గార మండలం బందరువానిపేటలో కూడా కొన్ని ఇళ్లల్లోకి నీరు చేరడంతో ప్రజలు ఆందోళన చెందారు. తీరప్రాంత మంతటా ఈదురు గాలులు నిరంతరంగా వీయడంతో.. ఇళ్లకే జనం పరిమితమైపోయారు. మత్స్యకారులు వేటకు వెళ్లనీయకుండా హెచ్చరికలు జారీచేయడంతో.. ఒడ్డున పడవలు లంగరు వేసేశారు. తుఫాన్ ఏ ప్రమాదం మిగుల్చుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

తుఫాన్.. అలజడి

- 'మొంథా' ప్రభావంతో జిల్లాలో జోరువాన
- నేడు, రేపు కూడా భారీ వర్షాలు ● అల్లకల్లోలంగా సముద్రం
- తీరప్రాంతాల్లో అధికారుల మకాం ● కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్

సోమవారం నమోదైన వర్షపాతం(మి.మీటర్లలో)	
పోలాకి	65.0
పలాస	65.0
సరుబుజ్జిలి	58.5
గార	48.5
ఇచ్ఛాపురం	40.0
సంతబొమ్మాళి	38.75
సోంపేట	38.75
నరసన్నపేట	32.75
వజ్రపుకొత్తూరు	30.5
కోటబొమ్మాళి	30.5
కంచిలి	28.25
నందిగాం	24.25
శ్రీకాకుళం	22.75
రణస్థలం	21.0
మందస	27.0
ఆమదాలవలస	25.75
టెక్కలి	21.0
బూర్జ	16.5
జలుమూరు	16.0
మెళియాపుట్టి	14.5
లావేరు	13.75
ఎల్.ఎన్.పేట	13.5
కవిటి	13.0

శ్రీకాకుళం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో సోమవారం జిల్లావ్యాప్తంగా వర్షాలు కురిశాయి. సోమవారం సాయంత్రం నుంచి ఈదురుగాలుల కూడా వీచాయి. బంగాళాఖాతం సముద్రానికి ఆనుకుని జిల్లా ఉండటంతో తుఫాన్ ప్రభావం కనిపించింది. జిల్లాలో అత్యధికంగా పలాస, సరుబుజ్జిలి, పోలాకి, గార, ఇచ్ఛాపురం మండలాల్లో వర్షం కురిసింది. శ్రీకాకుళంలో ప్రజలు అవస్థలకు గురయ్యారు. కాంప్లెక్స్ ఆవరణలో ఎప్పటిలాగే నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అలాగే గొర్లవానిపేట తదితర ప్రాంతాల్లో వరిపంట నేలకొరిగింది. ఒప్పంగి స్కూల్ వద్ద వర్షపు నీరు చేరింది. ఇలా పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

● జిల్లా అంతటా రెడ్ అలర్ట్ కొనసాగుతోంది. తుఫాన్ తీరం దాటనున్న వేళ.. మంగళ, బుధవారాల్లో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఇప్పటికే వాతావరణశాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో అధికారులు (మిగతా 6వ పేజీలో..)



గొర్లవానిపేటలో నేలకు ఒరిగిన వరి పంట



పోలాకి: దండులక్ష్మీపురంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి చక్రధర్‌బాబు, ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎస్పీ మహేశ్వరరెడ్డి



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

'థర్మల్' మహాధర్నా భగ్నం

- ఉద్యమకారులను అడ్డుకున్న పోలీసులు
- పాలకొండ రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

సరుబుజ్జిలి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): 'థర్మల్'కు వ్యతిరేకంగా ఉద్యమకారులు నిర్వహించ తలపెట్టిన మహాధర్నా కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జెన్‌కో క్రిటికల్ థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్టు ప్రచారం సాగుతోంది. దీనిని ఆయా ప్రాంతాల గిరిజనులతోపాటు మైదాన గ్రామాలకు చెందిన కొంతమంది వ్యతిరేకిస్తున్నారు. వారికి రాష్ట్ర ఆదివాసీ పరిషత్ సంఘం, కమ్యూనిస్టు పార్టీలు, రైతు సంఘం, ఇతర ప్రజా సంఘాల నాయకులు మద్దతుగా నిలుస్తున్నారు. థర్మల్‌కు వ్యతిరేకంగా కొన్ని రోజులుగా నిరసన ర్యాలీలు, ఉద్యమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం సరుబుజ్జిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహణకు పిలుపునిచ్చారు. కాగా, దీనికి పోలీసులు అనుమతి ఇవ్వలేదు. సోమవారం ఉదయానికే శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, పది మంది ఎస్‌ఐలు, పోలీసులు భారీగా మోహరించారు. సరుబుజ్జిలి తహసీల్దార్ కార్యాలయం నుంచి పాలకొండ రహదారిలో వివిధ ప్రాంతాల్లో నిఘా పెట్టారు. ఉద్యమ నాయకులను వివిధ చోట్ల ముందుగానే నిర్బంధించారు. అయినప్పటికీ వెన్నెలవలసకు చెందిన కొంతమంది గిరిజనులు పాలకొండ రహదారిలో సరుబుజ్జిలికి వస్తుండగా.. చిగురువలస జంక్షన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. మహాధర్నాకు అనుమతి లేదని స్పష్టం చేశారు. దీంతో వారు అక్కడే బైఠాయించి థర్మల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో పాలకొండ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పార్వతీపురం- వీరఘట్టం- రాజాం, (మిగతా 6వ పేజీలో..)



ఉద్యమకారులతో మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద



ప్రధాన రహదారిపై బైఠాయించిన గిరిజనులు

కందిరీగల దాడి

● చీకటి బలరాంపురంలో 25 మందికి గాయాలు

ఇచ్ఛాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మండలం చీకటి బలరాంపురం గ్రామానికి చెందిన 25 మందికి కందిరీగల దాడిలో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన సుమారు 40మంది స్థానిక శివాలయంలో సోమవారం పూజలు చేశారు. అనంతరం ఆలయ సమీపంలో చెట్టు వద్ద వనభోజనాల కోసం వంటలు చేస్తున్నారు. అదే సమయంలో ఓ గెద్ద ఎగురుతూ వచ్చి.. చెట్టుకు ఉన్న కందిరీగల పుట్టను తాకింది. దీంతో కందిరీగలు చెల్లాచెదురై అక్కడ ఉన్న మహిళలు, చిన్నారులు, వృద్ధులపై దాడి చేశాయి. బాకి లక్ష్మి, యశ్మిత, రాజేశ్వరి, ఆశి దేవరాజు, ధనలక్ష్మి, మోక్షిత్, యశ్వంత్ తోపాటు మొత్తంగా 25 మందికి శరీరం, ముఖంపై గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని ఇచ్ఛాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.దేవేంద్రరెడ్డి, సిబ్బంది చికిత్స చేశారు. ముఖం, శరీరంలోకి చొరబడిన కందిరీగల ముల్లులను తొలగించారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని డాక్టర్ దేవేంద్ర రెడ్డి తెలిపారు.



ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితులు.. చికిత్స అందజేస్తున్న వైద్యుడు

పలు రైళ్లు రద్దు

● మరికొన్ని దారి మళ్లింపు

టెక్కలి/ పలాస, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ఈస్ట్‌కోస్ట్ రైల్వే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.పవన్‌కుమార్, రైల్వేశాఖ చీఫ్ పాసింజర్ రవాణా మేనేజర్ సందీప్ కుమార్ సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 43 కోచింగ్ ట్రైన్లతోపాటు భువనేశ్వర్-బెంగుళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్(18463), భువనేశ్వర్-సికింద్రాబాద్ వెళ్లే విశాఖ ఎక్స్‌ప్రెస్(17015), భువనేశ్వర్ - పాండిచ్చేరి వీక్లీ ఎక్స్‌ప్రెస్(20851) వంటి రైళ్లను మంగళవారం రద్దు చేసినట్లు వెల్లడించారు. అలాగే 28న కటక్-గుణుపూర్ మెమూ రైలు(68433), 29న గుణుపూర్-కటక్ మెమూ రైలు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. విశాఖ-గుణుపూర్ పాసింజర్ (58506), గుణుపూర్-విశాఖ పాసింజర్(58505) మంగళవారం రద్దయిందన్నారు. టాటానగర్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్(18189) రైలును దారి మళ్లించారు. ఈ రైలు టిట్లాఘర్, రాయపూర్, నాగపూర్ మీదుగా వెళ్తుంది. 18447 భువనేశ్వర్-జగదల్‌పూర్, 18017 రూర్కెలా- జగదల్‌పూర్ రైలు రాయఘడ వరకు చేరుకొని తిరిగి అక్కడ నుంచే వెనుదిరుగుతుంది. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించి రైల్వేశాఖకు సహకరించాలని కోరారు.

రైతుల్లో మొంథా గుబులు


మెళియాపుట్టి: బందపల్లి వద్ద నెలకొరిగిన వరి పంట

- ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- తుఫాన్‌తో బిక్కుబిక్కుమంటున్న రైతులు
- పలుచోట్ల నెలకొరిగిన వరిపైరు

నరసన్నపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొంథా తుఫాన్ వల్ల రైతుల్లో అలజడి నెలకొంది. దీని ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలకు వరద నీరు చేరడంతో అన్నదాతల్లో గుబులు నెలకొంది. వర్షానికి తోడు చిన్నపాటి గాలులు వీస్తుండడంతో పలు చోట్ల వరిపైరు నేలకొరిగింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లాలో 4,75,947 ఎకరాల్లో 3,57,289 మంది రైతులు వరితోపాటు మొక్కజొన్న తదితర వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారు. వీటిలో వరి 3.69 లక్షల ఎకరాల్లో సాగులో ఉంది. ఇప్పటికే సుమారు 1.70 లక్షలు ఎకరాల్లో వెన్ను విదిల్చగా మరో వారంలో కోతకు సిద్ధమవుతున్నట్టు రైతులు చెబుతున్నారు.


వజ్రపుకొత్తూరు: శివసాగర్ బీచ్‌లో ఎగిసిపడుతున్న అలలు


పలాస రూరల్: రెంటికోట వద్ద కురుస్తున్న వర్షం


ఎల్‌ఎన్ పేట: దబ్బపాదు గ్రామ సమీపంలో నేలకొరిగిన వరి చేలు


పలాస: మార్కెట్ రోడ్డులో ప్రవహిస్తున్న వరద నీరు


ఇచ్ఛాపురం: రోడ్డుపై నిలిచిన వర్షపునీరు


పలాస: పాత జాతీయరహదారిపై ప్రవహిస్తున్న వరదనీటి ప్రవాహం


జిల్లా కేంద్రాసుపత్రి పరిశీలిస్తున్న చక్రధర్‌బాబు

ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలి

- జిల్లా ప్రత్యేకాధికారి చక్రధర్‌బాబు

టెక్కలి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రాసుపత్రిలో రోగులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని డీసీహెచ్‌వో కల్యాణ్ బాబుకు మొంథా తుఫాన్ జిల్లా ప్రత్యేకాధికారి చక్రధర్‌బాబు ఆదేశించారు. సోమవారం రాత్రి టెక్కలిలోని 200 పడకల జిల్లా కేంద్రాసుపత్రిని చక్రధర్‌బాబు తోపాటు ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సందర్శించారు. తుఫాన్ నేపథ్యంలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్ సూర్యారావుకు ఆదేశించారు. తుఫాన్ నేపథ్యంలో అధికారులు చేపట్టాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. వైద్య సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈయనతో పాటు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి కూడా ఉన్నారు.

ఎం.సున్నాపల్లి పునరావాస కేంద్రం

సంతబొమ్మాళి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎం.సున్నాపల్లి పునరావాస కేంద్రాన్ని జిల్లా ప్రత్యేకాధికారి చక్రధరబాబు, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎస్పీ మహేశ్వరరెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి ఉన్నారు.

- కొత్తూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దిమిలి, కురిగాం, కుద్దిగాం, పోనుటూరుల్లో పునరావాస కేంద్రాల ఏర్పాటుకు గుర్తించినట్లు తహసీల్దార్ కె.బాలకృష్ణ చెప్పారు. సోమవారం కొత్తూరు సీఐ ప్రసాద్‌తో కలిసి ఆయా పునరావాస కేంద్రాలను పరిశీలించారు.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

టెక్కలి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో తుఫాన్ నేపథ్యంలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడైనా అత్యవసర పరిస్థితుల్లో సమస్యలు ఏర్పడితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం తెలియజేయాలని కోరారు.

టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయం	9704033093
టెక్కలి తహసీల్దార్ కార్యాలయం	9550903835
హిరమండలం తహసీల్దార్ కార్యాలయం	8978386525
సారవకోట తహసీల్దార్ కార్యాలయం	9989918305
సంతబొమ్మాళి తహసీల్దార్ కార్యాలయం	7337093259
కొత్తూరు తహసీల్దార్ కార్యాలయం	9963150587
కోటబొమ్మాళి తహసీల్దార్ కార్యాలయం	8520056046
ఎల్‌ఎన్‌పేట తహసీల్దార్ కార్యాలయం	897898 1952
మెళియాపుట్టి తహసీల్దార్ కార్యాలయం	9059319508
పాతపట్నం తహసీల్దార్ కార్యాలయం	6309832213


నరసన్నపేట: స్టేట్‌బ్యాంకు రోడ్డులో కూలిన చెట్టు


పాతపట్నం: మహేంద్రతనయ నదిపై కాజ్‌వేను పరిశీలిస్తున్న అధికారులు


గార: వలలు భద్రపరిచిన శాలలో దిగాలుగా మత్స్యకారులు


పలాస: కాశీబుగ్గ వద్ద రెండు అడుగుల నీటిలో ఉన్న పోస్టాఫీసు ప్రధాన రోడ్డు


బందరువానిపేటలో ఇళ్ల మధ్య చేరిన నీరు


సోంపేట రూరల్: ఇసకలపాలెంలో సురక్షిత ప్రాంతాలకు తెప్పను తరలిస్తున్న దృశ్యం

అప్రమత్తమైన వంశధార అధికారులు

హిరమండలం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వంశధార అధికారులు అప్రమత్తమయ్యారు. నదిలో వరద ప్రవాహం పెరిగితే లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా ముందు జాగ్రత్తగా గొట్టాబ్యారేజీ ఎగువ ప్రాంతంలో నిల్వ ఉంచిన నీటిని కిందకు విడిచిపెడుతున్నారు. ఇన్‌ఫ్లో 8,000 క్యూసెక్కులు వస్తుండగా.. 8,991 క్యూసెక్కులు నీటిని కిందికి విడిచిపెట్టారు. ఎడమ, కుడి ప్రధాన కాలువ గేట్లను మూసివేశారు. క్యాచ్‌మెంట్ ఏరియాలో సోమవారం 28.60 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. కాగా గొట్టాబ్యారేజీ వద్ద నీటినిల్వ పరిస్థితిని జడ్పీ సీఈవో పరిశీలించారు.


గొట్టాబ్యారేజీ వద్ద కిందకు నీటిని విడిచి పెడుతున్న దృశ్యం


సోంపేట: బారువ బీచ్‌ను మూసివేస్తున్న మెరైన్ పోలీసులు

బారువ బీచ్ మూసివేత

సోంపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ అలజడి నేపథ్యంలో బారువ బీచ్‌ను మెరైన్ పోలీసులు సోమవారం మూసివేశారు. సీఐ వి.రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది బీచ్‌కు వెళ్లే రహదారిని మూసివేసి.. మూడు రోజుల పాటు అటువైపు రావద్దని సందర్శకులకు తెలిపారు. ఈనెల 30వరకు బారువ, రట్టి, పుక్కళపాలెం బీచ్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో కూడా సముద్ర స్నానాలు ఆచరించవద్దని కోరారు.


బూర్జ మండలం నారాయణపురం వద్ద నాగావళి నీటి ప్రవాహం

నిలకడగా నాగావళి

సరుబుజ్జిలి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నాగావళి నదీ ప్రవాహం నిలకడగా ఉందని ఇరిగేషన్ శాఖ ఏఈ రామశివాజీ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి నారాయణపురం వద్ద నదికి 12,000 క్యూసెక్కుల వరదనీరు చేరిందన్నారు. ఎగువన తోటపల్లి, మడ్డువలస రిజర్వాయర్ల నుంచి వరద నీటిని విడిచిపెడితే తప్ప నదిలో ప్రవాహం పెరిగే అవకాశం లేదన్నారు.


రణస్థలం: కంట్రోల్‌రూమ్‌ను పరిశీలిస్తున్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే ఎన్ఈఆర్


ఇచ్ఛాపురం: అధికారులతో సమీక్షిస్తున్న డ్వామా పీడీ సుధాకర్


ఎచ్చెర్ల: డి.మత్స్యలేశంలో పర్యటిస్తున్న అధికారులు, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్


కొత్తూరు: మాతల హైస్కూల్‌ను పరిశీలిస్తున్న అధికారులు


నరసన్నపేట: సోమేశ్వరస్వామి ఆలయం వద్ద బారులతీరిన భక్తులు


అరసవల్లి: ఉమారుద్రకోటేశ్వరుని దర్శించుకున్న శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

శికోకాం

- శివాలయాల్లో భక్తుల రద్దీ

కార్తీక మొదటి సోమవారం జిల్లాలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే శివాలయాల్లో దర్శనానికి బారులు తీరారు. శివునికి అభిషేకాలు చేశారు. శ్రీముఖలింగం, రావివలస, శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వరాలయం తదితర చోట్ల మధ్యాహ్నం వరకు భారీ క్యూలు కనిపించాయి.

- ఆంధ్రజ్యోతి బృందం


గార: అలంకరణలో వీర వసంతేశ్వరస్వామి


ఆమదాలవలస: సంగమేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు


పాతపట్నం రూరల్: కొరసవాడ శివాలయంలో..


నందిగాం శివాలయంలో..


పాతపట్నం: నీలకంఠేశ్వరుని ఆలయంలో..


మందస: కాశీవిశ్వేశ్వరాలయంలో..


సోంపేట: బారువ కోటిలింగేశ్వర ఆలయంలో..


కవిటి: జగతిలో శివాలయం వద్ద బారులుతీరిన భక్తులు


అరసవల్లి: ఉమారుద్ర కోటేశ్వరాలయంలో..

తుఫాన్.. అలజడి

(ఐదో పేజీ తరువాయి)

జిల్లావాసులను అప్రమత్తం చేశారు. తీరప్రాంతాల్లో పర్యటించి తుఫాన్‌ను ఎదుర్కోవడంపై అవగాహన కల్పించారు. తుఫాన్ ప్రత్యేకాధికారి చక్రధరబాబు సోమవారం టెక్కలి, సంతబొమ్మాళి, పోలాకి తదితర మండలాల్లో పర్యటించారు. తుఫాన్ కారణంగా తీసుకుంటున్న ముందస్తు చర్యలను పరిశీలించారు. తీరప్రాంతాల ప్రజలు ఈదురు గాలులకు చిక్కకుండా రక్షిత భవనాల్లో ఉండాలని.. అవసరమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఇదిలా ఉండగా.. శ్రీకాకుళం కలెక్టరేట్‌లో ప్రజలకు అత్యవసర సహాయం అందించేందుకు కంట్రోల్ రూమ్ (08942 240557)ను ఏర్పాటు చేశారు. మంగళవారం ఈదురుగాలులు బలంగా వీయనున్నాయని.. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే తక్షణమే చర్యలు చేపట్టేలా యంత్రాంగం సిద్ధమైంది. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు తీరప్రాంతమంతటా చేరుకున్నాయి. రోడ్లపై చెట్లు కూలితే తక్షణ అవసరం కోసం సహాయ సామగ్రిని సిద్ధం చేశాయి. రాష్ట్రస్థాయి అధికారులు కూడా నిరంతరం సమీక్షలు నిర్వహిస్తుండటంతో జిల్లా యంత్రాంగం తుఫాన్ నిర్వహణ పనుల్లో నిమగ్నమయ్యారు. మరో రెండు రోజులపాటు తుఫాన్ ప్రభావం ఉండనుండడంతో ఇప్పటికే పాఠశాలలకు, కళాశాలలకు అధికారులు సెలవులు ప్రకటించారు.


బందరువానిపేటలో ఇంట్లో చేరిన వర్షపునీటి బయటకు తోడుతున్న మహిళ

'థర్మల్' మహాధర్నా భగ్నం

(ఐదో పేజీ తరువాయి)

పాలకొండ ప్రాంతాల నుంచి సరుబుజ్జిలి, హిరమండలం, పాతపట్నం, నరసన్నపేట, టెక్కలి, శ్రీముఖలింగం వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కొద్దిసేపటి తర్వాత డీఎస్పీ ఆదేశాల మేరకు కన్వీనర్ సురేష్‌దొర రోడ్డుపై బైఠాయించిన వారికి నచ్చజెప్పారు. వారు ఆందోళన విరమించారు. కాగా.. మళ్లీ మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రకాష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కోనాడ మోహన్‌రావు తదితరులు సరుబుజ్జిలి చేరుకున్నారు. థర్మల్ ప్రాజెక్టును ఏర్పాటు చేయొద్దంటూ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం థర్మల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఘనంగా ఛట్ పూజలు

కంచిలి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బిహార్, ఉత్తరప్రదేశ్ ప్రాంతాల ప్రజలు నిష్ఠతో చేసే ఛట్ పూజలను మండలంలోని మఠం కంచిలి వద్ద ఆ ప్రాంతాల నుంచి వలస వచ్చిన మహిళలు, స్థానికులతో కలసి సోమవారం ఘనంగా నిర్వహించారు. బిహారీలు దేశవ్యాప్తంగా ఎక్కడ ఉన్నా నాగుల చవితి నాటి నుంచి 48గంటలపాటు ఉపవాస దీక్ష చేపట్టి షష్ఠి రోజు సాయంత్రం సూర్యుడికి పూజలు చేస్తారు. మరునాడు సూర్యునికి ప్రత్యేక పూజలు చేస్తారు.


చెరువు వద్ద పూజలు చేస్తున్న మహిళలు

తుఫాన్‌పై ప్రజల్లో అప్రమత్తత అవసరం


కవిటి: పుక్కళ్లపాలెంలో పర్యటిస్తున్న టీడీపీ నేతలు, అధికారులు


సరుబుజ్జిలి: వంశధార పరీవాహక ప్రాంతంలో పర్యటిస్తున్న అధికారులు


జి.సిగడాం: మాట్లాడుతున్న జీవన్‌చంద్ర

అరసవల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో శ్రీకాకుళం నియోజకవర్గం ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. ఈ మేరకు ఒక ప్రకటన సోమవారం విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 28, 29 తేదీల్లో తుఫాన్ ప్రభావం చూపే అవకాశం ఉన్నట్టు తెలిపారు. ప్రజలందరూ అ ప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో శ్రీకాకుళం కంట్రోల్ రూమ్ 08942-240557ను సంప్రదించాలన్నారు.

కవిటిలో...

కవిటి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ బి.మురళీమోహన్, ఎస్ఐ వి.రవివర్మ, ఎంపీడీవో ఎల్.త్రినాథ్‌లు కోరారు. సోమవారం ఇద్దివానిపాలెం గ్రామాన్ని సందర్శించి మత్స్యకారులతో మాట్లాడారు. ఎవరూ వేటకు వెళ్లవద్దని, వర్షాలు కురిసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో మండల కేంద్రంలో అధికారులు అందుబాటులో ఉంటారని... సమాచారాన్ని అందించాలని కోరారు. మండల ప్రత్యేకాధికారి పి.సత్యనారాయణ తహశీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి అప్రమత్తం చేశారు. కవిటి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పి.కృష్ణారావు, పీఏసీఎస్ ఛైర్మన్ బాసుదేవ్ ప్రదాన్‌లు తీరప్రాంత గ్రామాల్లో పర్యటించి మత్స్యకారులను అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నగర పాలక సంస్థ కార్యాలయంలో...

శ్రీకాకుళం అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ నేపథ్యంలో నగర పాలక సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్టు కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగర ప్రజలు తాగునీరు, మురుగునీరు, విద్యుత్తు సమస్య, చెట్లు పడిపోవడం వంటి సమస్యలు ఉంటే కంట్రోల్ రూం 08942-229080 నెంబర్‌కు సంప్రదించాలన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు కంట్రోల్ రూం ఉంటుందన్నారు.

సరుబుజ్జిలిలో...

సరుబుజ్జిలి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో మండలంలో తహసీల్దార్ ఎల్.మధుసూదన్, ఎంపీడీవో ఎం.పావని ఆధ్వర్యంలో 16 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. 14 గ్రామ సచివాలయాలు, తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలోనూ కంట్రోల్‌రూమ్‌లను ఏర్పాటు చేశారు. వీరు తుఫాన్‌పై గ్రామీణులకు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తారు.

జి.సిగడాంలో...

జి.సిగడాం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి జీవన్ చంద్ర అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజుల పాటు భారీ వర్షాలు, గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. నష్టం జరగకముందే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఎం .సరిత, ఎంపీడీవో జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కంచిలిలో...

కంచిలి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, ఎంపీడీవో వి.తిరుమలరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వల్ల ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమైన సమాచారంతోపాటు సేవలు అందించాలన్నారు. అధికారులు. సిబ్బంది, అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రణస్థలంలో...

రణస్థలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక అధికారి వి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం తీర ప్రాంత గ్రామల్లో ఆయన పర్యటించారు. మత్స్యకారులను అప్రమత్తం చేశారు వలలు, పడవలు భద్రపరుచుకోవాలని మత్స్యకారులకు సూచిచారు. కొచ్చెర్ల, ఎన్‌జీఆర్‌పురం, కొవ్వాడ, జీరుపాలెం, దోనిపేట, కొత్తముక్కాం, అల్లివలస, చీకటిపేట, గురయ్యపేట గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించామని, వీరందరూ సచివాలయం సిబ్బందితో గ్రామాల్లో ఉండి పని చేస్తారన్నారు. ఆయనతో పాటు తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, పలువురు అధికారులు ఉన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోండి...

సోంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తున్నందున రైతులు వరిపంట పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని టెక్కలి ఉద్యానవన సహాయ సంచాలకులు సీహెచ్ చంద్రశేఖరరావు కోరారు. పొలంలో నిలిచిన నీటిని బయటకు పంపాలని, వర్షాలు ఆగిన వెంటనే 19.19.19 లేదా 13.04.45 లేదా యూరియా వంటి పోషకాలు పంటలపై పిచికారీ చేయాలని సూచించారు. నేల ఆరిన తరువాత రసాయనిక ఎరువులను చల్లాలని తెలిపారు. ఎండు తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను లీటర్ నీటిలో 3గ్రాములు, లేదా మెటాలాక్సిల్, మ్యాంక్‌జెబ్ రెండూకలిపి 2గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆకుమచ్చ తెగులు నివారణకు ఒక గ్రాము కార్బండిజంను లీటర్ నీటిలో లేదా మ్యాంకోజెల్ 2.5గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. బ్యాక్టీరియా, మచ్చతెగులు నివారణకు 3గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటర్ నీటితో పాటు ప్లాంటామైసిన్ 0.2గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఆయన సూచించారు.

మత్స్యకారులకు టార్పాలిన్ల పంపిణీ

ఎచ్చెర్ల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): డి.మత్స్యలేశం, రాళ్లపేట, కొత్త దిబ్బలపాలెం, భగీరథపురం తదితర గ్రామాల్లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు సోమవారం పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. భారీ వర్షాలు కురిసే పడే అవకాశం ఉన్న దృష్ట్యా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తాటాకు ఇళ్లలో నివసిస్తున్న వారికి టార్పాలిన్లు, కవర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా మేనేజర్ కె.సత్యనారాయణ, పి.చైతన్యకుమార్, ఎన్.ఉమాశంకర్, బి.జగదీష్, సుమతి తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యమకారుల అరెస్టు అన్యాయం'

అరసవల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): థర్మల్ పవర్ ప్లాంటు రద్దు చేయాలని కోరుతూ సరుబుజ్జిలి తహశీల్దారు కార్యాలయానికి వెళుతున్న ఉద్యమకారులను అరెస్టు చేయడం అన్యాయమని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోవిందరావు అన్నారు. సోమవారం ఆయనను ధర్నాకు వెళ్లకుండా రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ థర్మల్ పవర్ ప్లాంట్‌తో ప్రజల భూములను కార్పొరేట్లకు ధారాదత్తం చేయడమే అభివృద్ధా అని ప్రశ్నించారు. శాంతియుతంగా ధర్నా చేసేందుకు వెళుతున్న వారిని నిర్బంధించి, పోలీసు స్టేషన్లకు తరలించడం సరికాదన్నారు.

నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఆర్డీవో లక్ష్మణమూర్తి

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం శాసనసభ నియోజకవర్గ పరిధిలో నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అంగీకరించినట్లు ఇన్‌చార్జి ఆర్డీఓ ఎస్‌వి. లక్ష్మణమూర్తి తెలిపారు. నియోజకవర్గానికి సంబంధించిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 1200 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా 45 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్చించామన్నారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం ఎమ్మార్వో ఎస్.గణపతిరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మాదారపు వెంకటేష్(టీడీపీ), ఈశ్వర్ (కాంగ్రెస్), ఆర్.శంకరరావు (వైసీపీ), ఎస్.తేజేశ్వరరావు (బీజేపీ) తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి సిద్ధం

అరసవల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా జిల్లాలో తలెత్తే విద్యుత్తు అంతరాయాలను ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధం చేశామని ఏపీఈఈడీసీఎల్ ఎస్ఈ ఎస్.కృష్ణమూర్తి తెలిపారు. అక్టోబరు 28 నుంచి 31 వరకు జిల్లాలో భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. విద్యుత్తు లైన్లు తెగిపడడం, లేదా స్తంభాలు పడిపోవడం వంటి సమస్యలు ఎదురైతే వెంటనే సర్కిల్ కార్యాలయం హెల్ప్‌లైన్ డెస్క్ నెంబర్ 9490612633కు కాల్ చేయాలన్నారు. తుఫాను అనంతరం విద్యుత్తు సరఫరా పునరుద్ధరణ కోసం 13వేల మందికి పైగా సిబ్బంది, క్రేన్లు, పోల్ డ్రిల్లింగ్ మెషీన్లు, పవర్ సాస్, 350 ట్రాన్స్‌ఫార్మర్లు, 700 స్తంభాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రజలు తడిగా ఉన్న స్తంభాలను తాకడం, వేలాడుతున్న వైర్ల కింద నడవద్దని సూచించారు. టోల్ ఫ్రీ నెంబర్ 1912ను సంప్రదించవచ్చని తెలిపారు.

సాంకేతిక విజ్ఞానానికి మైలురాయి క్వాంటమ్


బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఎచ్చెర్ల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సాంకేతిక విజ్ఞానంలో క్వాంటమ్ టెక్నాలజీ మైలురాయి కాగలదని శ్రీకాకుళం శాసనసభ్యుడు గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో నేషనల్ క్వాంటమ్ మిషన్‌లో భాగంగా ఐబీఎం క్వాంటమ్ సహకారంతో నిర్వహించిన క్విస్కిట్ ఫాల్ ఫెస్ట్- 2025 సోమవారంతో ముగిసింది. ముగింపు సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ క్వాంటమ్ టెక్నాలజీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయని చెప్పారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటుచేసిందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన హ్యాకథాన్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివరామకృష్ణ, ఎఫ్‌వో సీహెచ్.వాసు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్కమాంబతల్లి బోనాలు

పొందూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నాగవంశం సామాజికవర్గ కులదైవం అక్కమాంబతల్లి బోనాలు ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం మొదటి సోమవారం అక్కమాంబతల్లికి బోనాలు ఉత్సవం నిర్వహిస్తారు. నాయుడు వీధి నుంచి బోనాలను అక్కమాంబగుడికి తీసుకువచ్చి సమర్పిస్తారు. ఈ సందర్భంగా నిర్వహించిన తప్పెటగుళ్ళు, కోలాటం భక్తులను ఆకట్టుకున్నాయి. అక్కమాంబను ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి కూన ప్రమీల, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

మహిళా ఉపాధ్యాయులనే నియమించాలి

అరసవల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): డా.బీఆర్.అంబేద్కర్ బాలికల గురుకులాల్లో మహిళా ఉపాధ్యాయులనే నియమించాలని, పురుష ఉపాధ్యాయ నియామకాలను ఆపాలని కోరుతూ దళిత ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. బాలికల గురుకులాల్లో పురుష ఉపాధ్యాయుల నియామకం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కోఆర్డినేటర్ యశోదలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దుర్గాసి గణేష్, మిస్కా కృష్ణయ్య, చంద్రమౌళి, మామిడి అప్పలరాం, వై.జానకిరావు, బోనెల చిరంజీవి, తారక, అక్కెన రాజారావు తదితరులు పాల్గొన్నారు.

బూరవెల్లిలో నాగుల చవితి పూజలు

గార, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బూరవెల్లిలో సోమవారం షష్టి సందర్భంగా గ్రామస్థులు నాగులచవితి పండుగను నిర్వహించారు. పుట్టల వద్దకు వెళ్లి నాగదేవతకు పాలు పోసి..పూజలు చేశారు. ఏటా నాగుల చవితి పండుగను షష్టి రోజున నిర్వహించడం ఈ గ్రామంలో ఆనవాయితీ.


పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

అర్ధాంతరంగా నిలిచిన నిర్మాణాలు

● పలు చోట్ల అద్దె భవనాల్లో కొనసాగుతున్న వైనం ● ఇదీ పలాస మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి



నారాయణపురంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన అంగన్‌వాడీ కేంద్ర భవనం

పలాసరూరల్,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పలాస మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు తిష్టవేశాయి. వివిధ క్లస్టర్ల పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నిర్వహించాల్సివస్తోంది. కొన్నిచోట్ల భవనాల పనులు చేపట్టినా బిల్లులు కాకపోవడం తదితర కారణాల వల్ల పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నారాయణపురంలో రేకు షెడ్డులో ఇరుకైన గదిలో, ఈదురాపల్లి కేంద్రంలో చిన్న గదుల్లో, సరియాపల్లిలో ఓ చిన్న ఇంటిలో కేంద్రాలను నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల భవనాలు లేక వేరే చోట వంట వండించి కేంద్రాలకు తీసుకొచ్చి పిల్లలకు అందజేయాల్సివస్తోంది. కేశుపురంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో గత ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణం చేపట్టినా పనులు నిలిచిపోవడంతో ఓ రేకులషెడ్డును అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్నారు. సరియాపల్లి, కొత్తూరు, ఈదురాపల్లి అంగన్‌వాడీ కేంద్రాలు కూడా ఇరుకు గదుల్లో కొనసా గుతున్నాయి. కొన్ని చోట్ల విద్యుత్ లేకపోవడంతో చీకట్లోనే నడిపిస్తున్నారు.

రైతు సేవా కేంద్రంలో వైద్య సేవలు

● పరిసరాల్లో మురుగునీటి నిల్వతో తరలింపు ● రోగులకు తప్పని అవస్థలు ● ఇదీ బమ్మిడికాలనీ ఆరోగ్య ఉపకేంద్రం పరిస్థితి

కొత్తూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):మండలంలోని బమ్మిడి కాలనీలో గల ఆరోగ్యఉపకేంద్రం రైతుసేవాకేంద్రంలో(ఆర్ఎస్‌కే) నిర్వహిస్తున్నారు. ఆరోగ్య ఉపకేంద్రాన్ని దశాబ్దకాలం కిందట ప్రభుత్వం రూ.13 లక్షలు వెచ్చించి భవనం నిర్మించారు. ఇక్కడి ఆరోగ్య ఉపకేంద్రం చుట్టూ ఉన్న స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. వర్షం, వాడుకనీరు వేళ్లేందుకు మార్గం లేకపోవడంతో ఆరోగ్యకేంద్రం ఎదురుగా రహదారిపై బురద, మురుగు నీరు నిల్వఉండడంతో ప్రజలు వెళ్లేందుకు సరైన మార్గం లేకుండాపోయింది.బురద సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో ఆరోగ్య ఉపకేంద్రం మూసివేసి రైతుసేవా కేంద్రానికి (ఆర్ఎస్‌కే) తరలించాల్సి వచ్చింది.ఈనేపథ్యంలో ఆ భవనం అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది.అయితే ఆర్ఎస్‌కే శ్మశానవాటికకు ఆనుకుని ఉండడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులను వైద్యం కోసం తీసుకువచ్చేందుకు భయాందోళన చెందుతున్నారు.రైతు సేవాకేంద్రంలో ఒకగదిలో వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఇతర సామగ్రి ఉన్నాయి. మరో గదిలో వైద్యం కోసం వచ్చే వారికి సేవలు అందిస్తున్నారు. అయితే ఇరుగ్గాఉండే గదుల్లో సామగ్రి నిల్వఉండడంతో ఇక్కడకు వచ్చే రోగులు అసహనం వ్యక్తంచేస్తున్నారు.కాగా ఆరోగ్యఉపకేంద్రం సమస్య తన దృష్టికి వచ్చిందని కురిగాం ఆసుపత్రి వైద్యాధికారి పెద్దిని ప్రసన్న కుమార్ తెలిపారు. సమస్యను మండల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించాలని కోరునున్నట్లు చెప్పారు.


బమ్మిడికాలనీలో ఆరోగ్యఉపకేంద్రం ఎదురుగా నిల్వఉన్న బురద నీరు

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

రణస్థలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) ముక్తుంపురం గ్రామానికి చెందిన మంత్రి పెద్ద అప్పలనాయుడు (37) ఉరి వేసుకుని సోమవారం మృతి చెందాడు. జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల మేరకు మద్యం మత్తులో అప్పలనాయుడు భార్య రోజాతో ప్రతిరోజు గొడవ పడేవాడు.ఈనెల 18న రోజా కన్నవారి ఇంటివెళ్లింది. దీంతో మద్యంమత్తులో అప్పలనాయుడు సోమవారం ఉరివేసుకుని మృతిచెందాడు. అప్పలనాయుడుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆచూకీ కోసం గాలింపు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పీఎన్‌కాలనీ నాయుడు చెరువు గట్టుకు చెందిన దువ్వ రాజ్యలక్ష్మి (42) డే అండ్‌నైట్ కూడలి వద్ద ఉన్న వంతెనపై నుంచి నాగావళి నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఆమె ఆచూకీ కోసం సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు రెండు బోట్లపై నాగావళి నదిలో గాలింపు చర్యలు చేపట్టాయి. కానీ ఆమె ఆచూకీ లభించలేదు. రాజ్యలక్ష్మి భర్త మోహన్‌రావు నగరంలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. రాజ్యలక్ష్మి కూడా ఓ ప్రైవేటు డెంటల్ ఆసుపత్రిలో చిరుద్యోగం చేస్తోంది.కుమార్తె కుసుమ ఫిర్యాదుమేరకు శ్రీకాకుళం టూటౌన్ సిఐ ఈశ్వరరావు కేసు దర్యాప్తు చేపట్టారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే దువ్వ రాజ్యలక్ష్మి నాగావళి వంతెనపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు కుటుంబ సభ్యులు తెలిపారని సీఐ ఈశ్వరరావు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎచ్చెర్ల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చిలకపాలెం జంక్షన్‌కు సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం వైపు వెళుతూ.. ఆగిఉన్న టిప్పర్‌ను అదే రూట్‌లో వెనుక నుంచి గొర్రెలతో వెళ్తున్న ఓ వ్యాన్ ఢీకొంది. ఈ సంఘటనలో వ్యాన్‌లో ఉన్న ఒడిశాకు చెందిన బరకల బైరాగి, రాపాక తిరుపతి గాయపడ్డారు. వ్యాన్ డ్రైవర్ సురక్షితంగా బయటపడగా, గాయపడిన వారిని చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. బైరాగి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడిన మహిళకు..

ఇచ్ఛాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం రైలు నిలయంలో రైలు దిగుతూ మహిళలు జారిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వివరాలివీ.. బొడ్డకాళి గ్రామానికి చెందిన లోలాక్షి భర్తతో కలిసి పారాదీప్‌లో నివసిస్తున్నారు. బంధువుల ఇంట్లో శుభకార్యానికి విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో ఇచ్ఛాపురం చేరుకున్నారు. రైలు దిగుతుండగా కాలు జారి ప్లాట్‌ఫారంపై పడటంతో తలకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ఆమెకు తలపై తీవ్ర గాయమైంది. ప్రస్తుతం ఆమె కోలుకుంటోందని వైద్యులు తెలిపారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్టు

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మపురం సమీపంలో తోటలో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేశారు. వద్ద నుంచి రెండు ద్విచక్రవాహనాలు. రెండు సెల్‌ఫోన్లు, రూ.1020 నగదు స్వాధీనం చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ ఈశ్వరరావు చెప్పారు. ధర్మపురం జీడితోటలో పేకాట పందెలు జరుగుతున్నట్లు సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు ఆయన చెప్పారు.

పూడిలంకకు రహదారి నిర్మాణం

● రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరక్టర్ పుచ్చ ఈశ్వరరావు

వజ్రపుకొత్తూరు,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పూడిలంకకు ఇచ్చిన హామీ మేరకు గ్రామం వరకు రహదారి నిర్మించి ఎమ్మెల్యే గౌతుశిరీష మాట నిలబెట్టుకున్నారని రాష్ట్ర అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ డైరక్టర్ పుచ్చ ఈశ్వరరావుపేర్కొన్నారు.సోమవారం పూండిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వందల ఏళ్ల నుంచి పూడిలంక గ్రామానికి రహదారి సౌకర్యంలేకపోవడంతో గ్రామస్థులు ఇబ్బందిపడ్డారన్నారు. పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధిచేయాలన్న తలంపుతో పనిచేస్తున్న ఎమ్మెల్యేగౌతుశిరీష పనితీరుకు పూడిలంక రహదారి నిర్మాణం మచ్చుతునకగా నిలిచిపోతుందన్నారు. రూ. నాలుగు కోట్లు కేటాయించడంతో రానున్నరోజుల్లో ఈప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, నాయకులు గణేష్, లావేటి శంకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పుచ్చ ఈశ్వరరావు

సిబ్బంది అందుబాటులో ఉండాలి

● మొంథా తుఫాన్ నేపథ్యంలో సమీక్షించిన అధికారులు

మొంథా తుఫాన్ నేపథ్యంలో అన్నిశాఖ సిబ్బంది అందుబాటులో ఉండాలని అధికారులు కోరారు.ఈ మేరకు సోమవారం తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో సమీక్షించారు. పలు చోట్ల పర్యటించి ప్రజలను అప్రమత్తంచేశారు.

పాతపట్నం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాలని జడ్పీ సీఈవో డి.సత్యనారాయణ కోరారు.స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోఅధికారులతో మొంథాతుఫాన్‌పై సమీక్షించారు.అనంతరం పాతపట్నం వద్ద మహేంద్రతనయ నదిపైగల కాజ్‌వే వంతెనను పరిశీలించారు. కార్యక్రమాలలో మండలప్రత్యేకాధికారి మంచుకరుణాకరరావు తహసీల్దార్ నందిగామప్రసాదరావు, ఎంపీడీవో రమణమూర్తి పాల్గొన్నారు. కాగా మొంథా తుఫాన్ ఎదుర్కొనేం దుకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి మంచు కరుణాకరరావు తెలిపారు.తహసీల్దార్‌కార్యాలయంలో అన్నిశాఖల మండల స్థాయి అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కె.గోపాలపురం, హెచ్.గోపాలపురం, చంగుడి లోతట్టుప్రాంతాలను పర్యవేక్షించాలని కోరారు.

●పలాస, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఒక ప్రకటనలో కోరారు. మంగళ, బుధవారాల్లో అధికవర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశముందని, రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాగా తుఫాన్ పురస్కరించుకుని పూర్తిస్థాయి విధులు నిర్వహించి ప్రజలకు సహాయం చేయడానికి సిబ్బంది సిద్ధంగా ఉండాలని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు కోరారు. ఈ మేరకు సోమవారం మునిసిపల్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు.

●పలాసరూరల్: తుఫాన్ దృష్ట్యా లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టేలా ప్రత్యేక చర్యలు చేపట్టామని తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి తెలిపారు. ఆయాపంచాయతీల్లో వీఆర్వోల ద్వారా సమాచారం తెలుసుకునేందుకు, పరిస్థితి వివరించేందుకు కంట్రోల్‌రూమ్, ఫోన్‌నెంబరును ఏర్పాటు చేశామని చెప్పారు.

●పోలాకి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీవ్రత పెరిగే అవకాశాలు ఉన్నాయని రాత్రి సమయంలో అధికారులు అందుబాటులో ఉండి సమాచారం అందజేయాలని తుఫాన్ ప్రత్యేకాధికారి చక్రధర్‌బాబు, ఎస్పీ మహేశ్వరరెడ్డి మహేశ్వరరెడ్డి సూచించారు. తొలుత ఆర్డీవోలక్ష్మణమూర్తి, డీఎల్‌పీవో గోపీబాల, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీవోరవికుమార్ రాజారాంపురం, రేవుఅంపలాం, అక్కువరం గ్రామాలను, మధ్యాహ్నం జిల్లా మొంథా తుఫాన్ ప్రత్యేకాధికారి చక్రధర్‌బాబు, ఎస్పీ మహేశ్వరరెడ్డి,సీఐ సూర్యనారాయణ,ఏడీ వెంకటమధు, ఏవో చిరంజీవి దండులక్ష్మీపురంలోని తుఫాన్‌షెల్టర్, బెలమర, బొద్దాం, కొత్తరేవు, గుల్లవానిపేట సాగరతీర గ్రామాలను పర్యటించి మత్స్యకారులను అప్రమత్తం చేశారు.

●మెళియాపుట్టి,అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జడ్పీసీఈవో సత్యనారాయణ తెలిపారు.రట్టిణి, గోకర్ణపురం గ్రామాలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మహేంద్రతనయలో నీరు పెరిగితే గ్రామస్థులు పునరావాసకేంద్రాలకు వెళ్లడానికి సిద్ధంగా ఉండాలని కోరారు.

●మందస,అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ దృష్ట్యా తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ తెలిపారు. తీరప్రాంతంలోని 30 గ్రామాల్లోని ప్రజలు సురక్షితగా ఉండేందుకు ప్రత్యేకచర్యలు చేపట్టామని చెప్పారు. తీర ప్రాంతాల్లో ఉన్న వారికి సూచనలు అందించేందుకు ఎంపీడీవో వై.వెంకటరమణ, ఎస్ఐ కృష్ణకుమార్‌లు కలిసి అప్రమత్తం చేశారని తెలిపారు.

●వజ్రపుకొత్తూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల సముద్రం అల్లకల్లోలంగా మారింది.కొన్నిచోట్ల ముందుకురావడంతో మత్స్యకారులు అప్రమత్తమై సామగ్రిని సురక్షత ప్రాంతాలకు తలరించారు. తహసీల్దార్ సీతారామయ్య ఆధ్వర్యంలో తీరప్రాంతం పరిశీలించారు. తీరానికి ఎవ్వరు వెళ్ళవద్దని హెచ్చరించారు. శివసాగర్ తీరానికి ఎవ్వరిని వెళ్ళనీయకుండా రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు.

●జలుమూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు ప్రజలు, రైతులకు నష్టం జరుగకుండా గ్రామాల్లో అధికారులు చర్యలు చేపట్టాలని ప్రత్యేకాధికారి అరుంధతిదేవి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలంలో అధికారుల సమీక్షించారు. సమావేశంలో తహసీల్దార్ జె.రామారావు, హౌసింగు ఏఈ ప్రసాదరావు పాల్గొన్నారు.

●ఎల్.ఎన్.పేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో భారీవర్షాలు కురిసే అవకాశంఉండడంతో ప్రజలకు అప్రమత్తంచేశామని తహసీల్దార్ జె. ఈశ్వరమ్మ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.లక్ష్మీనర్సుపేట, బసవరాజుపేట, మిరియాపల్లి, వాడవలస, దబ్బపాడు వంశధారనదీ తీరగ్రామాలతోపాటు తురకపేట, ధనుకువాడ,చిట్టిమండలం తదితర లోతట్టు గ్రామాల్లో రెవెన్యూ సిబ్బందితో 24 గంటలు ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

●నందిగాం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యాలపేట గ్రామాన్ని అధికారులు అధికారులు సందర్శించి అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాం తంకావడంతో గ్రామస్థులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా కంట్రోల్‌రూమ్‌కు సమాచారం ఇవ్వాలని మండల ప్రత్యేకాధికారి ఐవీ రమణ, తహశీల్దార్ పి.సోమేశ్వరరావు, ఎంపీడీవో కుమార్‌పట్నాయక్‌లు సూచించారు. తుఫాన్‌ను దృష్టిలో పెట్టుకొని తహసీల్దార్ కార్యాలయం, ఎంఆర్‌సీల్లో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటుచేశారు. కాగా తుఫాన్ దృష్ట్యా ఉన్నతాధికారుల సూచనల మేరకు నందిగాం బాలికల గురుకులం విద్యార్థులు ఇళ్లకు బయలులేరి వెళ్లారు.


పాతపట్నం: అధికారులతో సమీక్షిస్తున్న జడ్పీ సీఈవో సత్యనారాయణ

ఇంగ్లీష్ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

హరిపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ అతిథి అధ్యాపకునిగా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.తేజేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. పీజీలో 50 శాతం మార్కులతో కలిగిఉండాలని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఒకసెట్ జిరాక్స్‌లతో ఈనెల 29లోగా బయోడేటాను మందస ప్రభుత్వజూనియర్ కళాశాల కార్యాయంలో అందించాలని కోరారు. ఈ నెల 31న శ్రీకాకుళం బాలురు జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. విశ్రాంతఅధ్యాపకులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.

ఆదర్శంగా తీసుకోవాలి

కోటబొమ్మాళి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసరావు సేవలు ఆదర్శంగా తీసుకోవాలని కాకినాడకు చెందిన మూడో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.మన్మథరావు తెలిపారు. సోమవారం నీలంపేటలో పోలీసుల అమరవీరుల దినం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామానికి చెందిన రొక్కం శ్రీనివాసరావు ఏపీఎస్పీలో పనిచేస్తూ విధి నిర్వహణలో భాగంగా కొమరాడ మండలంలోని కొప్పాడంగిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యారని, ఆయన ధైర్యసాహశాన్ని కొనియాడారు.కార్యక్రమంలో శ్రీనివాసరావు భార్య అలివేణి, తల్లి మాణిక్యం, సర్పంచ్‌సావిత్రమ్మ, రొక్కం కళ్యాణ్ సాగర్, ఎస్. వైకుంటరావు పాల్గొన్నారు.

బొర్రంపేటలో గ్రామసభ

ఎల్.ఎన్.పేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):మండలంలోని బొర్రంపేటలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. బొర్రంపేట పంచాయతీని లక్ష్మీనర్సుపేట మండలం నుంచి సరుబుజ్జిలి మండలానికి మార్చాలని బొర్రంపేట గ్రామస్థులు ఇటీవల కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సూచనల ప్రకారం గ్రామంలో సోమవారం గ్రామసభను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవోశ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, ఏఎంసీ వైస్‌చైర్మన్ కె.కృష్ణమాచారి, బి.చిట్టిబాబు పాల్గొన్నారు.

గ్రావెల్ డంపింగ్‌పై పరిశీలన


డంపింగ్ చేసిన కంకరను పరిశీలిస్తున్న విజయలక్ష్మి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పలాసరూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):కంబిరిగాం వరహాలగెడ్డకు సమీపంలో గ్రావెల్ డంపింగ్ చేస్తుండడంపై టెక్కలి మైనింగ్‌అధికారి బి.విజయలక్ష్మి సోమవారం పరిశీలించారు. కంబిరిగాంలో గ్రావెల్ డంపింగ్‌పై ఇటీవల ఆంధ్రజ్యోతిలో యథేచ్ఛగా కంకర డంపింగ్ శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో లొద్దభద్ర వద్ద అక్రమ తవ్వకాలు, కంబిరిగాం వద్ద డంపింగ్ చేస్తున్న స్థలాన్ని పరిశీలించారు. అక్రమంగా డంపింగ్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. ఆమెతో పాటు తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి, వీఆర్వోలు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతను ప్రోత్సహించాలి: ఎంజీఆర్

పాతపట్నం,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించాలని జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ గ్రంధి మల్లిఖార్జున రావును ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఢిల్లీలోజీఎంఆర్‌గ్రూప్ చైర్మన్ గ్రంధి మల్లిఖా ర్జునరావును సోమవారం కలిశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ నిరుద్యోగ యువత జీవనోపాధికి దూరప్రాంతాలకు వలసవెళ్తున్నారని ఆయనకు వివరించారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

పోలాకి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా సభ్యుడు, థర్మల్ విద్యుత్ ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు నేతింటి నీలంరాజు తెలిపారు. సోమవారం పోలాకిలో విలేకరులతో మాట్లాడుతూ సరుబుజ్జిలి మండలంలోని వెన్నెలవలస వద్ద ఏర్పాటుచేస్తున్న థర్మల్ ప్లాంట్‌ను ఆపాలని నిరసన వ్యక్తంచేస్తున్న ఉద్యమ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టుచేయడం సరైన పద్ధతికాదని తెలిపారు. థర్మల్ ప్లాంట్ నిర్మాణం వల్ల రైతులకు ఇబ్బంది ఏర్పడుతుందని భావించి ఈ సమస్యపై ఆందోళన చేపడితే పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు.వారికి విడుదలచేయాలని కోరారు.

● నరసన్నపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించి థర్మల్ ఉద్యమాన్ని ఆపలేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు ఆరోపించారు. థర్మల్ ఉద్యమకారులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న శ్రీనివాసరావును సోమవారం చేనులవలసలో గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ థర్మల్ ఉద్యమంపై ప్రజాప్రతినిధులు నోరు ఎందుకు మెదపడంలేదని ప్రశ్నించారు.

నైతిక విలువలపై సదస్సుల ఏర్పాటు

టెక్కలి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మనుషుల మధ్య రోజురోజుకు అంతరించిపోతున్న నైతిక విలువలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు పోస్టల్ శాఖ ఏఎస్పీ డీవీఎన్ ప్రతాప్ తెలిపారు. సోమవారం టెక్కలిలో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవంబరురెండోవ తేదీ వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు.వారోత్సవాల్లో భాగంగా సారవకోట మండలంలోని మహసింగి, మెళియాపుట్టి మండలం లోనిపెద్దపద్మాపురం, సంతబొమ్మాళి మండలంలోని ఆకాశలక్కవరం, కోటబొమ్మాళి మండలంలోని యలమంచిలి, జర్జంగి గ్రామాల్లో నైతిక విలువలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్ తిరుపతిరావు, సిబ్బంది వినయ్‌కుమార్, అప్పారావు, గోపాల్, ప్రసాద్, తిరుపతిరావు పాల్గొన్నారు.

గురుకులం ప్రిన్సిపాల్‌గా ఈశ్వరరావు

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అక్కుపల్లి ఎంజేపీ మత్స్యకార బీసీ గురుకుల పాఠశాల ప్రినిపాల్‌గా డి.ఈశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. ఆయన పెద్దాపురం పాఠశాల నుంచి అక్కుపల్లి పాఠశాలకు బదిలీపై వచ్చారు. పాఠశాలలో భవనాలు సమస్య ఉందని, ఇప్పటికే రూ.46 లక్షలతో భవనాలు నిర్మాణం, మరమ్మతులకు అంచనా వేసి ప్రతిపాదనలను సొసైటీకి పంపించినట్లు ఈశ్వరరావు చెప్పారు.

టెక్కలిలో చదరంగం పోటీలు

టెక్కలి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):టెక్కలిలో జిల్లాస్థాయి స్కూల్ ఓపెన్ చదరంగం పోటీలను డీఎస్పీ లక్ష్మణరావు సోమవారం ప్రారంభించారు. 228మంది చదరంగం క్రీడాకారులు పాల్గొనగా అండర-15 విభాగంలో యశ్వంత్ ప్రథమస్థానం, బగాదికార్తికేయ ద్వితీయస్థానం, అండర్-12 విభాగంలో భార్గవ్ ప్రథమ, శేషాద్రి ద్వితీయస్థానం, అండర్-9లో శశాంత్ ప్రథమ, సుమిత్ ద్వితీయస్థానం సాధించారు. వీరికి మురళీధర్, పిడే ఆర్బిటార్ భీమారావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కిషోర్, సునీల్, వర్మ, రమేష్, అవినాష్, లోకేష్ పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తాచాటిన విద్యార్థులు

నరసన్నపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నరసన్నపేటకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. ఇటీవల గుంటూరు జిల్లా తెనాలి నిర్వహించిన 69వ అంతర్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అండర్-19 విభాగంలో జూనియర్ కళాశాలలో చదువుతూ స్థానిక వీరహనుమాన్ వ్యాయమశాలలో శిక్షణపొందిన పి.రాజేష్ 79 కేజీల విభాగంలో స్నాచ్ 95 కేజీలు, క్లీన్ అండ్ జర్క్‌లో 120 కేజీలు మొత్తం 215 కేజీలు బరువు ఎత్తి గోల్డ్ మెడల్ సాధించాడు. పి.గణేష్ 88 కేజీల విభాగంలో స్నాచ్ 90 కేజీలు, క్లీన్ అండ్ జర్క్‌లో 117 కేజీలు బరువు ఎత్తి సిల్వర్ పతకం సాధించాడు. డిసెంబరు రెండో వారంలో మహారాష్ట్ర సాంబాజీనగర్‌లో జరిగే జాతీయ పోటీలకు రాజేష్ ఎంపికయ్యాడని కోచ్ అప్పలరామన్న తెలిపారు.

●టెక్కలి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): టెక్కలికి చెందిన జి.అభిరామ్ ఈనెల 22 నుంచి పశ్చిమగోదావరి జిల్లా పెదవేగిలో స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-19 విభాగంలో 400 మీటర్లలో బంగారు పతకాన్ని సాధించినట్లు పీడీ శ్రీనివాసరావు తెలిపారు.అలాగే జి.అనూష మూడువేల మీటర్ల పరుగుపందెంలో వెండి పతకం, బి.మోక్ష ఐదువేల మీటర్ల పరుగుపందెంలో రజిత పతకం సాధించారని తెలిపారు. నవంబరులో హర్యానాలో జరిగే ఆల్‌ఇండియా నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు వీరు జాతీయస్థాయి క్రీడలకు ఎంపికయ్యారని చెప్పారు.

సీతాపురంలో నందమ్మ సంబరాలు

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) సీతాపురంలో నందమ్మ సంబరాల ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా పగటివేషాలు, మేళతాళలతో నందెమ్మను ఊరేగించారు. ఏటా దసరా తర్వాత నందెమ్మ వేడుకలు ప్రారంభించి దీపావళి తర్వాత ముగింపు వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్థులు చెప్పారు. ఈ సందర్భంగా మహిళలు నృత్యాలు ఆకట్టుకున్నాయి.

కార్యకర్తలు సహకారం అందించాలి

కొత్తూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో పార్టీ కార్యకర్తలు సమన్వయంతో వ్యవహరించి తుఫాన్‌నేపథ్యంలో సహాయ సహకారాలు అందించేలా చర్యలుతీసుకోవాలని టీడీపీనాయకులు కోరారు. కొత్తూరులో టీడీపీ మాధవరావు, నాయకలు పడాల లక్ష్మణరావు, భగవాన్‌దాస్ నాయుడు దశరథరావు, మాతల గాంధీ, కుంచాలు నూకరాజు విలేకరులతో పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు పెరిగి.. గోతులు ఏర్పడి

● తరచూ ప్రమాదాలు ● ఇదీ పాతపట్నం-తెంబూరు రోడ్డులో పరిస్థితి

పాతపట్నం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పాతపట్నం నుంచి తెంబూరు వెళ్లే బీటీరోడ్డు నిర్వహణలోపంవల్ల ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరగడంతోపాటు రోడ్డంతా గోతులమయంకావడంతో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. సీతారాంపల్లి కూడలి దాటిన తర్వాత దారిపొడుగునా పలుచోట్ల రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీర్ఘకాలంగా ఈరోడ్డుపై మరమ్మతులు లేకపోవడంతో వర్షాలు కురిస్తే గోతుల్లో నీరు చేరుతుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరగడంతోపాటు సింగిల్‌రోడ్డుకావడంతో ఎదురుగావచ్చే వాహనాలు తప్పించుకోవడానికి వీల్లేకుండాపోయింది. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని, గుంతలు పూడ్చాలని పలువురు కోరుతున్నారు.


పాతపట్నం-తెంబూరు రోడ్డుకు ఇరువైపులా ఏపుగాపెరిగిన పిచ్చిమొక్కలు

పర్యవేక్షణ లేక.. మురుగు నీరు చేరి

● ఇదీ పోలాకి బీసీ బాలుర వసతిగృహం ఎదుట పరిస్థితి

పోలాకి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పోలాకి బీసీ బాలుర వసతిగృహం ఎదుట పారిశుధ్య నిర్వహణపై పర్యవేక్షణ లేకపోవడంతో మురుగు నీరు చేరడంతో అధ్వానంగా మారింది. బీసీకాలనీ మీదుగా వసతిగృహంతోపాటు ఎంఆర్‌సీ కార్యాలయానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిత్యం వెళ్తుంటారు. ఈనేపథ్యంలో రహదారిపైన పేడ, మల మూత్రాలు, పేరుకుపోయిన మురుగుకాలువ వసతిగృహం ఎదురుగా దర్శనమిస్తున్నాయి. వసతిగృహ విద్యార్థులు ఈమార్గంలో రాకపోకలు సాగించడం వల్ల వ్యాధులబారిన పడే అవకాశముందని భయాందోళన చెందుతున్నారు. ఇక్కడి వసతిగృహ సంక్షేమాధికారి రెండు వసతిగృహాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. దీంతో పనిభారం వల్ల పర్యవేక్షణ కొరవడిందన్న ఆరోపణలొస్తున్నాయి. అధికారులు దృష్టిసారించి హాస్టల్ ఎదుట పారిశుధ్యాన్ని పకడ్బందీగా నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.


పోలాకి బీసీ వసతిగృహం ఎదుట చేరిన మురుగునీరు